నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

చారిత్రక పరిశోధకులు యాదవరావుకు ఘన సన్మానం


యాదవరావును సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి వాస్తవ్యులు యాదవరావు చారిత్రక పరిశోధకులుగా జాతీయస్థాయి అవార్డును అందుకోవడంతో ఆయనకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ జాతీయ చైర్మన్ రాధిక సెషన్, మనూ వైస్‌ఛాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాఘవేందర్, ఉపాధ్యాయులు ఆనంద్, అబ్బయ్య, గులాం హైమద్, శ్రీనివాస్, తాహెర్, సురేష్ ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళితే.. ఇల్లు గుల్ల

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీలో ఒక కుటుంబం తమ బంధువుల అంత్యక్రియలకు వెళితే తిరిగి వచ్చేసరికి దొంగలు ఇల్లు దోచుకుని గుల్ల చేశారని బాధితులు వాపోయారు. శక్కర్ నగర్ కాలనీకి చెందిన అరుణ రాణి శుక్రవారం మేడ్చల్‌లో వారి బంధువులు మృతి చెందడంతో వారి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి వెనుక భాగాన ఉన్న తలుపులు ధ్వంసం చేసి ఉండడంతో పరిశీలించారు. ఇంట్లో వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న లక్షన్నర నగదు, సుమారు రెండు తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం దొంగలు దొంగిలించుకుపోయారని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్లో దొంగతనంపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పట్టణ సీఐ వీరయ్య చోరీ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు..

- పార్లమెంట్ ఎన్నికల్లోనూ చిత్తశుద్ధితో పనిచేయాలి
- అధికారులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో చక్కటి అధికారుల బృందం ఉందని, అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కితాబిచ్చారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ నూతన డైరీని అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్.డి.ఓ.లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు అంశాలను ప్రస్తావిస్తూ జిల్లాలో శాసనసభ ఎన్నికలను సజావుగా నిర్వహించామని, ఇదే స్ఫూర్తితో రాబోయే పార్లమెంటు ఎన్నికలలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ నెల 8న ఓటరు తుది జాబితా ప్రకటించనున్నందున ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకై వచ్చిన క్లెయిమ్స్ అన్నింటిని 7లోగా పూర్తిగా పరిష్కరించి తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికలకు నోడల్ అధికారులను మార్చామని, వారంతా ఎన్నికల నిర్వహణపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటరుగా ఉన్న వారు ఓటు అవకాశాన్ని కోల్పోకుండా ఎంప్లాయిస్ డేటాబేస్‌లో తప్పనిసరిగా ఎపిక్ వివరాలు నమోదు చేయాలని, వివరాలను వెంటనే అందించాలని అధికారులకు సూచించారు. ఓటరు తుది జాబితా అనంతరం భారత ఎన్నికల కమిషన్ ఎప్పుడైనా సమీక్షించవచ్చని, అధికారులు సంసిద్ధులుగా ఉండాలన్నారు. జిల్లాలో 3, 4 మండలాలలో ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించడం వల్ల ఎంతో పురోగతి సాధించామన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ జారీకై ప్రత్యేక డ్రైవ్ చేపట్టేలా చూడాలని ఆర్.డి.ఓ.లకు సూచిం చారు. ప్రతి శాఖ చేపడుతున్న కార్యక్రమాలలో ప్రగతి కనిపించాలని, పక్కా ప్రణాళికతో లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధి నిధుల కింద అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టడంతో పాటు వచ్చే వేసవిదృష్ట్యా మంచినీటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో మరమత్తులు, నిర్వహణ కోసం నియోజకవర్గ ప్రత్యేక నిధుల వినియోగించవలసినదిగా కలెక్టర్ అధికారులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయబోయే మరోరెండు పథకాల అమలుపై అధికారులు సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. సమావేశంలో ఆర్.డి.ఓ.లు శ్రీనివాస్‌రెడ్డి, మన్నే ప్రభాకర్, భుజంగం, సిపిఓ రాజారామ్, ఎస్సి కార్పొరేషన్ ఈడి దయానంద్, భూగర్భ జల శాఖ ఎడి సతీష్‌యాదవ్, పశు సంవర్ధక శాఖాధికారి సింహరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాసం

- సొసైటీ చైర్మన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి దశరథ్
- మాజీ స్పీకర్ ఇలాకలో బీఆర్ఎస్‌కు షాక్

నవతెలంగాణ-వర్ని


సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన దశరథ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న డీఎస్‌వో

మండలంలోని జాకోరా విండో చైర్మన్ కృష్ణరెడ్డిపై సభ్యులు శనివారం అవిశ్వాస తీర్మాన ప్రవేశపెట్టగా.. విండో సభ్యులు 13 మందికి గానూ 10 మంది సభ్యులు హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షులు కృష్ణరెడ్డి బలనిరూపణ చేసుకోవాల్సి ఉండగా.. సంఘం సభ్యులు 13 మందికి గానూ 10 మంది దశరథ్‌కు మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గింది. దీనితో జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస రావు, రాజేశ్వర్, రియాజ్, సిఈఓ రామకృష్ణ అధికారికంగా జాకోర సహకార సంఘం అధ్యక్షునిగా దశరథ్‌ను ప్రకటించారు. ఈ అవిశ్వాస తీర్మాణానికి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజర య్యారు. నియోజకవర్గంలో ఇదే మొదటి అవిశ్వాసం. దీంతో కాంగ్రెస్ పార్టీ కొంత బలపడుతుందనే చర్చ జరుగుతోంది. మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇలాకలో బీఆర్ఎస్ పార్టీకి ఇది పెద్ద షాక్ తగిలిందని చెప్పవచ్చు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్‌రావు, మండలాధ్యక్షులు సురేష్‌బాబా, సీనియర్ నాయకులు రాజారెడ్డి, నేమాని వీర్రాజు, సభ్యులు బంజా గంగారాం, కన్న, విష్ణువర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేలా కేంద్ర బడ్జెట్

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్ అప్ప

నవతెలంగాణ-బోధన్


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని కార్పొరే ట్లకు కట్టబెడుతున్న విధంగా ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగా ధరప్ప పేర్కొన్నారు. శనివారం బోధన్ ఆర్డిఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఆర్డిఓ కార్యాలయ పాలనాధికారి విఠల్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి చెందిన కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.2,22,281 కోట్లు కేటాయించారని అన్నారు. వాస్తవానికి రూ.1,17,588.79 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దేశం బాగు కోసం పేదలు, యువకులు, రైతులు మాత్రమే కీలకమని అన్నారు. రైతులకు అనేక లాభాలు రాయితీలు కల్పించినట్లు బడ్జెట్లో ప్రకటించారని కానీ సన్నకారు, చిన్నకారు రైతులను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. దేశాన్ని వ్యవసాయ దిగుమతులకు కేంద్రంగా తయారు చేస్తూ వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలకు ఆధిపత్యం చలాయించేలా నిధులు తగ్గించారని తెలిపారు. గతంలో నల్ల చట్టాలను ఉపసంహరించిన తిరిగి నల్ల చట్టాలను నేడు మరో రూపంలో అమలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే రుణమాఫీతో పాటు కనీసం మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నీరడి గంగామణి, జిల్లా కమిటీ సభ్యులు నీలం వీరమణి, ఎల్లయ్య, నాగమణి పాల్గొన్నారు.

నేర పరిశోధన పై పోలీసులకు శిక్షణ

నవతెలంగాణ-బోధన్

నేర పరిశోధనలో పోలీసులు వ్యవహరించవలసిన అంశాలపై శనివారం బోధన్ కోర్టు ప్రాంగణంలో అదనపు పీపీలు శ్యాంరావు, డా.సమయ్య బోధన్ నియోజకవర్గ పోలీసులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పీపీ డా.సమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య ఆదేశాల మేరకు కోర్టు చట్టాలు, నేర పరిశోధనపై పోలీసులకు ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసుల ఇన్వేస్టిగేషన్, చార్జిషీట్ దాఖలు చేయడం, నేర పరిశోధన, సాక్షిదారుల చట్టాలు కోర్టులో వాటి పనితీరుపై వివరించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ పీటర్, కోర్టు పోలీసు సిబ్బంది లక్ష్మణ్, సాయన్న, ప్రసాద్, తుకారం, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిచ్కుంద ఫలితాలు విడుదల

నవతెలంగాణ-బిచ్కుంద


ఫలితాలు విడుదల చేస్తున్న చంద్రముఖర్జీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ బిచ్కుంద మొదటి సెమిస్టర్ ఫలితాలను తెలంగాణ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి (సీ.ఓ.ఈ) ప్రొఫెసర్ అరుణ ఏ.సి.ఓ.ఈ. శాంతాబాయి చేతుల మీదుగా విడుదల చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయం సిఓఈ ప్రొఫెసర్ అరుణ మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు 57.45 ఉత్తీర్ణత శాతం సాధించారని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.చంద్ర శేఖర్, సి.ఓ.ఈ కే. అశోక్, ఏ.సి.ఓ.ఈ. డా.టి.హనుమాన్లు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-గాంధారి

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మతుసంగెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. మతుసంగెం గ్రామానికి చెందిన నీరడి సాయిలు (46) సంవత్సరాలు కామారెడ్డి జిల్లా అగ్రికల్చర్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అతనికి గుర్జాల్ గ్రామానికి చెందిన అతని మరదలతో గతంలో గొడవలు కాగా.. ఇరు కుటుంబాల బంధువులు సర్దిజెప్పారు. తర్వాత గతనెల 31న ఆ మహిళ ఇంట్లో చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోవడంతో గాంధారి పోలీస్‌స్టేషన్‌లో ఆ మహిళ తప్పిపోయిందని ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో వారి బంధువులు తననే నిలదీస్తారనే భయంతో తీవ్ర మనస్థాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నీరడి విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

16న సమ్మెలో పాల్గొంటాం

- మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసిన కార్మికులు

నవతెలంగాణ-కామారెడ్డి


వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు, నాయకులు

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నామని కామారెడ్డి మున్సిపల్ కార్మికులు కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంపుతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని ఫిబ్రవరి 16న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నారని, శానిటేషన్, వాటర్ వర్క్స్ సిబ్బందితో పాటు అన్ని కేటగిరీల కార్మికులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం సిఐటియు యూనియన్ జిల్లా బాధ్యులు ఎండి కలీం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని, పెండింగ్ పీఎఫ్ డబ్బులు చెల్లించాలని, మున్సిపాల్టీలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, నాలుగు నెలల ఏరియర్స్ ఇవ్వాలని తదితర డిమాండ్ల కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం 5వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని విడివిడిగా వినతి పత్రాలు అందజేసినట్లు వివరించారు.

తదితర సమస్యలపై జరుగుతున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు, ఎండి మహబూబ్ అలీ, పి.ప్రభాకర్, బాన్సువాడ రాజు, సాయిలు, ఎల్లారెడ్డి చంద్రయ్య, జితేందర్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూతురు పుట్టిన రోజునే.. తండ్రి మృతి

- ఆటో బోల్తాపడిన ఘటనలో మృతి.. మరో ఐదుగురికి గాయాలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్


బోల్తాపడిన ఆటో


హన్మండ్లు (ఫైల్)

కూతురు పుట్టిన రోజు వేడుకలను జరుపుకొని తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తా పడి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన బీర్కూర్ మండలంలో చోటుచేసుకుంది. నసురుల్లాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన సబ్బిడీ హన్మండ్లు (53) తన కూతురు జన్మదిన వేడుకల్లో పాల్గొనడానికి బంధువులతో కలిసి కుటుంబ సభ్యులతో ఆటోలో మిర్జాపూర్ గ్రామం నుంచి బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం చేరుకున్నారు. కూతురు కృష్ణవేణి (8) చిన్నారి జన్మదిన వేడుకలు జరుపుకొని ఆ స్వామివారి మొక్కులు తీర్చుకొని తిరిగు ప్రయాణంలో ఘాట్ రోడ్డు వద్ద ఆటోబ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఆటోలో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. వీరిలో హన్మండ్లుకు తీవ్ర గాయాలు కాగా.. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. కూతురు పుట్టిన వేడుకలకు వచ్చి మృతిచెందిన హన్మండ్లు మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ జన్మదినం రోజునే ప్రమాదంలో తన తండ్రి మరణించడంతో ఆ చిన్నారి బోరున విలపించడం.. అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. హన్మండ్లు ప్రభు త్వ ఉపాధ్యాయుడిగా కిష్టాపూర్‌లో విధు లు నిర్వహిస్తున్నారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హన్మండ్లు చనిపోయిన వార్త తెలుసుకొని పాఠశాలకు సెలవిచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంటలు పరిశీలించి సూచనలు చేయాలి

- ఏడిఏ రత్నం
- వరి పంటలు పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్


వరి పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ రత్నం

వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేయాలని ఏడిఏ రత్నం అన్నారు. శనివారం మండలంలోని కన్నాపూర్, లింగంపేట్ గ్రామాల్లో ఎల్లారెడ్డి వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నం వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరిలో సోకుతున్న తెగుళ్ల గురించి రైతులకు వివరించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరిలో మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నదని, దీని నివారణ కోసం క్లోరోపైరీఫాస్ అనే మందును ఎకరాకు 500 మిల్లీలీటర్లు లేదా కార్టప్ హైడ్రా క్లోరైడ్ 4జీ గులికలు ఎకరాకు 8 కిలోలు లేదా కార్టప్ హైడ్రా క్లోరైడ్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపించడంతో దీని నివారణ కోసం ప్లాంటమైసిన్ 50 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయవలసిందిగా రైతులకు సూచించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులు పండించిన పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు చర్యల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఏఈఓలు మధుసూధన్, రమ్య, ఆమెర్, సంతోష్, రైతులు సిద్దయ్య, మల్లేశం, సంతోష్, లక్ష్మీపతి, గంగాధర్, సతీష్ తదితరులున్నారు.

ఎస్ఎఫ్ఐ పోరాటంతో బోరుబావి పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్


బోరుపనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎస్ఎఫ్ఐ పోరాటంతో జడ్పీహెచ్ఎస్‌లో బోరుబావి పనులను ప్రజాప్రతినిధులు శనివారం ప్రారంభించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సుమారుగా 600 పైచిలుకు విద్యార్థులు విద్యన భ్యసిస్తున్నారని, విద్యార్థులకు నీటి సౌకర్యం లేకపోవడంతో ఈ విషయమై మండల నాయకులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడంతో ప్రస్తుతం జడ్పీ నిధులతో శనివారం బోరుబావి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మండలాధ్యక్షుడు షేక్ ఫిర్దోస్, జడ్పీహెచ్ఎస్ అధ్యక్షులు నాయకురాలు శివానంద, హెచ్ఎం హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేస్తాం

- జిల్లా ఉపాధి కల్పన అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ, ఇజ్రాయెల్‌లో విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుసూదన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయెల్‌లో నిర్మాణ కార్మికులు షట్టరింగ్ కార్పెంటర్‌లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్‌గా పనిచేయడానికి పెద్ద డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలలో నెలకు 1,20,000 నుంచి 1,38,000 వరకు ఆకర్షణీయమైన జీతం ప్యాకేజీతో వస్తాయని ఆయన తెలిపారు. ఈ ఉద్యోగాల కోసం అభ్యర్థి 21-45 సంవత్సరాలలోపు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులై, ఆయా రంగాలలో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. ఈ ఉద్యోగాల కోసం అభ్యర్థుల వివరాలను నమోదు చేసుకోవడానికి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఈ నెల 7న కలెక్టరేట్‌లోని 121వ గదిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తుందని మధుసూదన్ తెలిపారు. వివరాలకు www.tomcom.telangana.gov.inను వెబ్‌సైట్‌ను, లేదా 9985483931, 8247838789, 7893566493 నెంబర్లకు సంప్రదించవలసినదిగా ఆయన సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆచంపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందించినట్టు ప్రధానోపాధ్యాయులు ఈ.శంకర్ పేర్కొన్నారు. విద్యార్థులు అంకితభావంతో చదివి భవిష్యత్తులో తల్లిదండ్రులకు గురువులకు మంచిపేరు తీసుకురావాలని లయన్స్ క్లబ్ నిర్వాహకులు సాంబిరెడ్డి, వెంకటేశ్వరరావు, కిషోర్ పేర్కొన్నారు. ఏకాగ్రతతో చదివి భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని వారు కోరారు. తమ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించిన లయన్స్ వారికి ప్రధానోపాధ్యాయులు శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో చక్రవర్తి, గాంధీ, శ్రీనివాసరాజు, స్థానిక ఉపాధ్యాయులు ఆనంద్, అబ్బయ్య, గులాం హైమద్, శ్రీనివాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దోస్పల్లి సర్పంచ్ సేవలు ప్రసంశనీయం

నవతెలంగాణ-జుక్కల్

దోస్పల్లి సర్పంచ్ సేవలు ప్రసంశనీయమని దోస్పల్లి జీపీ సెక్రెటరీ జాదవ్ మనోహర్ అన్నారు. శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో జీపీ పాలకవర్గానికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేపిఎస్ జాదవ్ మనోహర్ మాట్లాడుతూ.. గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకంగా ఉంటుందని, సర్పంచ్ గ్రామానికి దిక్సూచిల వ్యవహరిస్తారని కొనియాడారు. అంతకుముందు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు పంచాయతీ సెక్రెటరీ, ఆశాకార్యకర్త, గ్రామస్తులు సన్మానించారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆశావర్కర్ బశవ్వ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి స్పెషల్ ఆఫీసర్‌గా ఏవో



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా మండల వ్యవసాయాధికారి ప్రజాపతి ఇన్‌చార్జీగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుండెల్లి సాయిలును ఉప సర్పంచ్ దామోదర్‌ను పూలదండలు శాలువాతో సన్మానించారు. ప్రజాపతిని వార్డు మెంబర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనకు ఐదు సంవత్సరాలు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాలను పరిశీలించిన టిటిడి అధికారులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్, గోపాల్‌పేట్, మాల్‌తుమ్మెద గ్రామాలలో గల పురాతన దేవాలయాలను టీటీడీ అధికారులు శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వ ఆదేశాల మేరకు సందర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. దేవాలయాలు అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారి రామానందం, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, కొమ్మ దత్తు, భీమ్‌రెడ్డి, వంశీగౌడ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

స్నేహ సొసైటీలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్ సహారా ఆధ్వర్యంలో స్నేహ సొసైటీలో అన్నప్రసాద కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య లయన్ జోన్ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్ చేకూరి, కోశాధికారి లయన్ నరసింహారావు, మెంబర్షిప్ చైర్మన్ ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణ లయన్ రామారావు తన కుమారుడు మదన్మోహన్రావు ప్రియాంకల మొదటి వివాహ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించినట్లు లయన్ రామారావు తెలిపారు. లయన్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు అని సభ్యులు పుట్టినరోజులు అన్నదాన కార్యక్రమాలు, శుభకార్యాలను అనాధ ఆశ్రమాలు, ఎన్జీవోఎస్ పాఠశాలలోనూ వికలాంగుల కు సంబంధించిన వాటిలో నిర్వహిస్తున్నారని జోన్ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్ చెప్పారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని, వీరే భావి భారత పౌరులని నగర మేయర్ దండు నీతు కిరణ్ అన్నారు. వివేకానంద పాఠశాల 25వ వార్షికోత్సవ సందర్భంగా ముఖ్య అతిథిగా నగర మేయర్ దండు నీతు కిరణ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులనృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల కరస్పాండెంట్ నరగౌడ్, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షబ్బీర్‌ను కలిసిన ఆకుల లలిత రాఘవేందర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సలహాదారులు గా పదవీ బాధ్యతలు స్వీకరించిన షబ్బీర్ అలీ ని సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, తెలంగాణ మల్టీ స్పెషాలిటి డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ నగరంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ జమాల్పూర్ రాజశేఖర్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పేస్టులు అందజేశారు. దంతాల విషయంలో అజాగ్రత్త పనికి రాదని డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రతి రోజు రెండు సార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. దంత సమస్యలు ఉంటే సొంత వైద్యం చేసుకోకుండా డాక్టర్ ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు జిల్కర్ విజయానంద్, చింతల గంగాదాస్, ప్రోగ్రామ్ చైర్మెన్ అబ్బాయి లింబాద్రి, శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత,పాఠశాల ప్రభంధకారిణి కమిటీ సభ్యులు సుదర్శన్ పాల్గొన్నారు.

16న జరిగే దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎన్ ఆర్ భవన్ లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు భూమన్న మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎస్బిఐలో షేర్లను అమ్మి ప్రైవేటీకరణ చేయనున్నారని, ఇది ప్రజా ద్రోహం అవుతుందని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చారని, ఆ చట్టాలను ఉపసంహరించుకోవాలని 13 నెలల పాటు రైతులు ఉద్యమం చేపట్టారన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే విధంగా ఈ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా మరియు రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు కార్మికులకు రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఎం శివకుమార్, ఐఎఫ్‌టి యు నగర నాయకులు జెల్లా మురళి, మోహన్, శంకర్, రాజు, ఎల్లప్ప మరియు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ పాలకవర్గ సభ్యులకు సన్మానం


సభ్యులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం తాజా మాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యులను గ్రామపంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ పెండే ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ పోతుగంటి స్వామీ, వార్డు సభ్యులను గ్రామపంచాయతీ సిబ్బంది శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పెండె ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ఆరోగ్యకరంగా ఉంచడంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది అందించిన సహాయ సహకారాలు మరవలేనిమన్నారు. పంచాయతీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామం అభివృద్ధి పథంలో నడిపేందుకు తన వంతుగా ఎల్లవేళలా కృషి చేశానని, ఇందుకు సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జులేఖ, చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణ అధికారి సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుడు నిత్య సేవకుడే

- తాజా మాజీ సర్పంచ్ రాజేశ్వర్


తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నవీపేట్

రాజకీయ నాయకుడికి పదవీకాలంతో సంబంధం లేకుండా నిత్య సేవకుడిగానే ఉంటాడని మహంతం తాజా మాజీ సర్పంచ్ రాజేశ్వర్ అన్నారు. మండలంలోని మహంతం గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గానికి శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ఎంపీడీవో సాజిద్ అలీ హాజరై శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ రాజేశ్వర్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో తన పదవి కాలంలో సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నామని అన్నారు. పంచాయతీ పాలకవర్గం అంతా ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయడం గొప్ప విషయమని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ఎంపీడీవో సాజిద్ అలీ అన్నారు. అనంతరం ఉప సర్పంచ్ పోశెట్టితోపాటు వార్డు సభ్యులను సన్మానించారు. కార్యదర్శి, అంగన్వాడి, ఆశలు పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమణ, గంగాధర్ తదితరులు ఉన్నారు.

17 నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 17 నుండి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.(ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ , ఎంఎస్సి, ఎంబీఏ, ఎంసీఏ)పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల (ఐఎంబీఏ, ఏపిఈ, పిసిహెచ్) ఏడవ, సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఫిబ్రవరి 17న ప్రారంభమై ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం www.telanganauniversity.ac.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నిశ్శబ్ద మహమ్మారి..గుర్తించకుంటే ప్రమాదకారి

- నేడు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

క్యాన్సర్ సోకితే కథ కంచికే అనుకుంటాం.. కానీ తగినంత అప్రమత్తతతో వ్యాధిని ముందుగానే కనిపెట్టగలిగితే క్యాన్సర్ నుండి రక్షణ పొందడం సాధ్యమే. అంతేకాదు అందుబాటులో ఉన్న తాజా వ్యాధి నిర్ధారణ పరీక్షలు సమర్థమైన చికిత్సలతో ఈ వ్యాధి మీద పోరాటంలో పైచేయి సాధించవచ్చు అంటున్నారు వైద్యులు.. క్యాన్సర్ వ్యాధి ,వాటిలోని రకాలు, లక్షణాలు నివారణ చర్యల గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సందర్భంగా నవ తెలంగాణ కథనం.



ఆహార అలవాటే అన్నిటికీ మూలం..



మనం తీసుకునే ఆహారం, పాటించే జీవన విధానంలో భాగంగా మనకు తెలియకుండానే చిన్న చిన్న పొరపాట్లు జరుగుతాయి. దీంతో వ్యాధుల బారిన పడుతున్నారు. క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుంది.
వెంకట్ గౌడ్, వైద్యులు, రిషిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఆర్మూర్.

కుటుంబ సభ్యులు తోడ్పాటు కీలకం..



క్యాన్సర్ బారిన పడిన కుటుంబ సభ్యులు బంధువులు రోగులతో నెగిటివ్‌గా మాట్లాడకూడదు. కుటుంబ సభ్యులు రోగుల మనోధైర్యాన్ని పెంచేలా నడుచుకోవాలి.
వై.శ్రావణ్‌రెడ్డి, ఎస్‌విఆర్, స్కాన్ సెంటర్, ఆర్మూర్.

సెప్టెంబర్‌లో వ్యాక్సినేషన్...

కేంద్ర ప్రభుత్వం గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గుర్తించి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తొమ్మిది నుండి 14 సంవత్సరాల బాలికలు దీని బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్ను ప్రోత్సహిస్తామని ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మల సీతారామన్ పేర్కొన్నారు.

క్యాన్సర్ రాకుండా...

మద్యపానం, ధూమపానం క్యాన్సర్ కారకాలు కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. వీలైనంత వరకు వాతావరణ కాలుష్యం నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి. కృత్రిమ రంగులు నిల్వ పదార్థాలు ఉపయోగించనివి ఆహార పదార్థాలని ఎంచుకోవాలి. సేంద్రియ పండ్లు కూరగాయలను ఎంచుకోవాలి. తల్లులు పిల్లలకు పాలివ్వడం ద్వారా రొమ్ము కేన్సర్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. హైపటైటిస్‌సి హెచ్‌పివి వ్యాక్సిన్లతో కాలియా సైర్ వెహికల్ క్యాన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చు. కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉన్నవాళ్లు జెనెటిక్ టెస్టింగ్‌తో క్యాన్సర్‌ను ముందుగానే పసిగట్టి తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు అంటున్నారు.

చికిత్స తదనంతర జాగ్రత్తలు...

క్యాన్సర్ వ్యాధి ప్రభావానికి వైద్యులు చికిత్సను అందిం చగలుగుతారు. అంతే తప్ప క్యాన్సర్ కారకానికి కాదు. ధూమపానంతో ఓరల్ కేన్సర్‌ఖు గురై కోలుకున్న వాళ్ల తర్వాత జరదా తింటే వాళ్ళ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడిన చందాగా మారుతుంది. కాబట్టి క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత సదరు క్యాన్సర్ కారకానికి దూరం గా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించాలి. లేదంటే క్యాన్సర్ నుంచి కోలుకున్న ఆరు నెలల వ్యవధిలో రెండోసారి కసిగా దాడి చేస్తుంది. బరువు పెరగకుండా, మ సాలాలు, రెడీమేడ్ మానేయాలని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాల్లోనూ...

ఉమ్మడి జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలతో పాటు నిర్ధారణ పరీక్షలు సైతం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మాధవ నగర్ ఇందూర్ కేన్సర్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించుకొని క్యాన్సర్ ను జయించిన వారిని జి జి హెచ్ సూపరిడెంట్ ప్రతిమ రాజ్, ఆస్పత్రి ఎండి ప్రద్యుమ్నారెడ్డి, జీఎం మునీందర్ రెడ్డి తదితరులు సత్కరించారు.. కామారెడ్డి జిల్లాలోని బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం స్వస్థవ క్యాన్సర్ కేర్ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలు దాటిన మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు.

క్యాన్సర్.. మొదటి దశలో ఉందా?

కేన్సర్ సోకుతుందని భయం ఉన్నవాళ్లు శరీరాన్ని అంతా స్కానింగ్ చేయమని వైద్యులను అడుగుతూ ఉంటారు.. శరీరంలో దాగి ఉన్న వ్యాధిని కనిపెట్టి దాని అంతు చూడాలని తాపత్రయం వాళ్లది. కానీ ఒకే ఒక పరీక్షతో అన్ని రకాల కేన్సర్ కణాలను కనిపెట్టడం సాధ్యం కాదు అలాంటి పరీక్షలు ఏమైనా అందుబాటులో ఉన్నప్పటికీ వాటితో కచ్చితంగా క్యాన్సర్ కణాలను కనిపెట్ట వచ్చని శాస్త్రీయంగా నిర్ధారణ కాలేదని విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. రక్తంలో ప్రయాణించే ట్యూమర్ సెల్స్‌ను కనిపెట్టే పరీక్ష కూడా కొత్తగా ప్రచారంలోకి వచ్చింది. కానీ ఇది అప్పటికే సోకిన కేన్సర్‌ను కనిపెట్టగలుగుతుందే తప్ప సోకే అవకాశాలను కనిపెట్టలేదు. కాబట్టి ముందు నుంచి అనుసరిస్తున్న క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలనే అనుస రించటం ఉత్తమం. రొమ్ము కేన్సర్‌ను స్వీయ పరీక్షలతో ముందుగానే కనిపెట్టవచ్చు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పాప్ స్మియర్ క్లినికల్ ఎగ్జామినేషన్‌తో, పెద్ద పేగు క్యాన్సర్ ను మిషన్ ఫర్ అక్కల్డు బ్లడ్ పరీక్షతో, లాంగ్ క్యాన్సర్‌ను ఎక్స్రే తో స్మోకర్ల, లాంగ్ కేన్సర్ సిటీ స్కాన్‌తో ప్రారంభ దశ లోనే కనిపెట్టి వీలుంది. క్యాన్సర్ చికిత్సలన్ని ఒకేలా ఉండవు. ప్రారంభ దశలో ఉన్న వేరువేరు క్యాన్సర్లకు అందించే చికిత్స విధానాలు కూడా వేరువేరుగా ఉంటాయి. తొలి దశ గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్కు సర్జరీ ఒక్కటే సరిపోతుంది. తదనంతరం కీమోథెరపీ రేడియేషన్ అవసరం ఉండదు. అలాగే ప్రారంభ దశలో ఉన్న రొమ్ము క్యాన్సర్‌కు సర్జరీతో పాటు కీమోథెరపీ కూడా అవసరం పడుతుంది. తొలి దశలో ఉన్న లాంగ్ క్యాన్సర్‌కు కూడా సర్జరీ ఒక్కటే సరిపోతుంది. తొలిదశలో ఉన్న గ్యాస్ట్రిక్ క్యాన్సర్, విరేచనం,పేగు క్యాన్సర్లకు కూడా సర్జరీ ఒక్కటే సరిపోతుంది. కీమోథెరపి రేడియేషన్ అవసరం ఉండదు. ఇలా చికిత్స తీసుకున్న తర్వాత అవసరాన్ని బట్టి కొన్ని రకాల క్యాన్సర్లకు కొంత కాలం పాటు మందులు వాడుకోవలసి ఉంటుంది. ఇలా తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి తగిన చికిత్సలు తీసుకో గలిగితే క్యాన్సర్ వ్యాధి నుంచి శాశ్వతంగా బయట పడవ చ్చు. దేశంలోనే గత నాలుగు సంవత్సరాల్లో 42.88 లక్షల మంది క్యాన్సర్ బారిన పడ్డారు.. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ క్యాన్సర్స్ ఫర్ రిజిస్ట్రీ లో పొందుపరిచిన వివరాల ప్రకా రం.. దేశవ్యాప్తంగా 2020 సంవత్సరంలో 13,92,179 కేసులు నమోదవగా 2021లో 14,26, 447 కేసులు, 2022లో 14,61,427 కేసులు నమోద య్యాయి. కేసులు మరణాల్లో ఉత్తర ప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, అత్యల్పంగా లక్షద్వీప్‌లో 28 కేసులు నమోదయ్యాయి.

ప్రమాదకరమైన 106(1)(2)సెక్షన్లను రద్దు చేయాలి

- 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె
- గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేద్దాం
- సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- ఆర్టీవో కమిషనర్ కార్యాలయంలో సమ్మెనోటీస్ అందజేత


సమ్మెనోటీస్ అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారతీయ న్యాయ సంహితలో ప్రమాదకరమైన 106(1)(2)లను రద్దు చేయాలని, ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేద్దాం అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లాలో ఆర్టీవో కమిషనర్ కార్యాలయంలో సమ్మెనోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ అందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ భారతీయ న్యాయ సంహిత- 2023లో దారుణమైన సెక్షన్ 106 (1), (2) లకు వ్యతిరేకంగా ఉద్యమించి రోడ్డు రవాణారంగ కార్మికులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని రవాణారంగ కార్మికులందరూ 2024 పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో సవరణను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 2024 ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. కొత్త చట్టంలో సెక్షన్ 106 (1) (2)గా మార్చబడిన బిఎన్‌ఎస్ సెక్షన్ 106(1) ప్రకారం 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా కూడా విధించబడుతుందన్నారు.

నూతన ప్రభుత్వం ఎంవి యాక్ట్ 2019 సవరణ కోసం కేంద్రం మీద ఒత్తిడి చేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేక ఒక డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఉపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు గీత, నేత, బీడీ కార్మికులకిస్తున్న తరహాలో నెలకు రూ.4,500లు జీవనభృతి ఇవ్వాలని కోరారు. మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా రోడ్డు రవాణా కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని తెలంగాణ ఫెడరేషన్ నిజామాబాద్ కమిటీ విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు యూనియన్ జిల్లా నాయకులు కృష్ణ అబ్దుల్ ముజీబ్ సిహెచ్ పండరి ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రమోదకు రెగ్యులర్ స్టాఫ్‌నర్స్ ఉద్యోగం

- కోవిడ్ సమయంలో గర్భిణీగా ఉండి సేవలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కోవిడ్ సమయంలో గర్భిణిగా ఉండి సేవలు అందించి నేడు రెగ్యులర్ స్టాఫ్ నర్స్ ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది అని సంగర్తి ప్రమోద అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నాలుగు నెలల గర్భిణిగా ఉండి ఔట్సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం వచ్చిన విధి నిర్వహణలో కరోన సోకిన ఇంట్లో వారి ప్రోత్సాహంతో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలు అందించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుండి నిజామాబాద్ కి వచ్చి గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందిస్తుంది. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగం పొందినందుకు చాలా సంతోషంగా ఉందని మీడియాతో అన్నారు.

విద్యారంగానికి నీటి బుడగల్లా నిధులు కేటాయించడం సరికాదు

- ఎస్ఎఫ్ఐ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్రప్రభుత్వం 2024-25 కేంద్ర బడ్జెట్లో ప్రభుత్వ విద్యారంగానికి నీటి మీద బుడగల్లా నిధులు కేటాయించడం సరికాదని నిజామాబాద్ జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిజి కాలేజ్ వద్ద బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించిందని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి కేంద్రబడ్జెట్ 47 లక్షల 65 వేల 768 కోట్లు ఉంటే ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం కేవలం 2.61 శాతం లక్ష 24 వేల 36 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ఈ అరకొర నిధులతో ఏ రకంగా అభివృద్ధి జరుగుతుందో కేంద్ర ప్రభుత్వమే చెప్పాలని అన్నారు. అదేవిధంగా కొఠారి కమిషన్ ప్రకారం కేంద్ర బడ్జెట్లో 10 శాతం నిధులు కేటాయించాలని ఉంటే 2.6శాతం కేటాయించి అందులో యుజిసికి గతం కంటే 60 శాతం నిధులను తక్కువగా కేటాయించడం, ఐఐఎంలకు 300 కోట్లు, ఉన్నత విద్యకు 47619 కోట్లు, పాఠశాల విద్యకు 73008 కేటాయించి, యధావిధిగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని విస్మరించిందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 లో కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తామని మాటల వరకే పరిమితమై, పనులు మాత్రం నీటి మీద బుడగల్లా ఉన్నాయని తెలిపారు. నవోదయ స్కూల్ గానీ, ట్రిబుల్ ఐటీలు గాని ఎన్ఐటీలు గాని కేంద్ర విశ్వవిద్యాలయాలు గాని పెండింగ్ లో ఉన్న ఫెలోషిప్ గురించి గాని ప్రస్తావించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిడిగా పర్మిషన్ ఇస్తు ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులందరూ తిప్పికొట్టాలని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించే రకంగా చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు వేణు దీపిక మరియు నగర నాయకులు సంతోష్ సందేశ్ అశ్విని, రమ్య, శ్రీహరి, రాజు, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ధర్మం గెలిచినట్టు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ


మాట్లాడుతున్న గోవిందు నరేష్ మాదిగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగితేనే దోపిడీ అనే అధర్మం మీద ధర్మం గెలిచినట్లు అవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలుగా అమలు జరుగుతున్న ఎస్సీ రిజర్వేషన్లను ఒక్క కులం మాత్రమే దోచుకుందని, నేటికీ ఆ దోపిడీ ఏకధాటిగా కొనసాగుతూనే ఉందని అన్నారు. ఎస్సీ జాబితాలో ఉన్న అన్ని కులాలకు అందాల్సిన రిజర్వేషన్లను ఒక్క కులమే ఏక పక్షంగా దోచుకోవడం అన్యాయం, అధర్మం అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాల్లో అందరికి అవకాశాలు లభించి అన్ని కులాలలో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. దోపిడీని, అసమానతలను నిర్మూలించడమే నిజమైన ధర్మంఅని, అందుకు ఎస్సీ వర్గీకరణ చేసి కేంద్ర ప్రభుత్వం ధర్మాన్ని నిలబెట్టాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణ కోసం కమిటిని నియమించి వేగంగా చర్యలు తీసుకుంటున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం గ్రామ, మండల స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

ఫిబ్రవరి 16న సమ్మెను జయప్రదం చేయండి

- గ్రామీణ బందును జయప్రదం చేయండి
- యూనియన్ గౌరవ అధ్యక్షులు ఏ .రమేష్ బాబు పిలుపు


మాట్లాడుతున్న నాయకురాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులందరూ సమ్మె నిర్వహించాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏ రమేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవాడలో గల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, మతతత్వ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. పది సంవత్సరాల కాలంలో ఐసిడిఎస్‌కు 60 శాతం బడ్జెట్ తగ్గించిందని, దీనివల్ల ఐసిడిఎస్ బలహీన పడుతుందని తెలిపారు. అందువల్లనే అంగన్వాడీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందడం లేదని, పక్కా భవనాలు కట్టించట్లేదని, మౌలిక వసతులు కల్పించట్లేదని ఆయన అన్నారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులను, స్కీం వర్కర్లను, కార్మికులకు గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ , పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్ణయం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని అందువల్ల ఇప్పటికైనా అంగన్వాడీ ఉద్యోగులకు నెలకు 26వేలు కనీస వేతనం చెల్లించాలని, పదివేల రూపాయలు పెన్షన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే దేవగంగు పి.స్వర్ణ, కోశాధికారి చంద్రకళ, ఉపాధ్యక్షులు మంగాదేవి, జిల్లా నాయకులు సూర్య కళ, విజయ, లావణ్య, జ్యోతి, వాణి, యమున, లక్ష్మి, జగదాంబ తదితరులతో పాటు సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

ఖథ్గాం గ్రామంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని ఖథ్గాం గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా 60సంవత్సరాలపై బడిన వారికి రక్తపరీక్షలు, ఈసీజీ, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మఠాధిపతి మల్లికార్జున స్వామి, వైద్యులు ఉమాకాంత్, రెడ్‌క్రాస్ సభ్యులు, వైద్యులు విక్రమ్‌కుమార్, దస్తీరాం, కొలవార్‌కుమార్ సెట్, రచ్చ శివకాంత్, డాక్టర్ నరసింహులు, హుండె బసవరాజ్, హనుమాన్లు, వైద్యులు, టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పలువురికి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని షేకాపూర్ గ్రామ అభివృద్ధికి గత ఐదేళ్ల కాలంగా కృషిచేసిన సర్పంచ్ ఏండి కరీం, ఉపసర్పంచ్ గౌతమ్ పంచాయతీ పాలకవర్గానికి ఆ గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు అజీమ్ పటేల్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. గ్రామానికి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్న పంచాయతీ రాజ్‌శాఖ డిప్యూటీ ఈఈ రవీంద్రబాబుకు పంచాయతీ పాలకవర్గానికి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధికారుల పాలనలో మరింతగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సన్మాన సభలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన పలువురు

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

నవతెలంగాణ-ఎడపల్లి/నాగిరెడ్డిపేట్

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు తెలిపారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయినందున ప్రభుత్వం గ్రామపంచాయతీలను నియమించింది. కాగా శనివారం గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. బ్రాహ్మణపల్లిలో ప్రత్యేక అధికారిగా (ఎంపీడీవో) గోపాలకృష్ణ, ఎడపల్లి గ్రామపంచాయతీలకు సుభాష్ చంద్రబోస్ (ఎంపీఓ) ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. మంగళ్‌పహాడ్, బాపునగర్, జీపి ప్రత్యేక అధికారిగా ఈ.సందీప్ బాధ్యతలు స్వీకరించారు. మిగతా గ్రామాలలో కూడా ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించి గ్రామాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు అధికారుల దృష్టికి రాగా పరిష్కార దిశగా పనిచేస్తామని ప్రత్యేక అధికారులు గ్రామస్తులకు తెలిపారు. అంతకుముందుగా బ్రాహ్మణపల్లి, వడ్డేపల్లి జీపి ప్రత్యేక అధికారులు గోపాలకృష్ణ, సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. గ్రామాలలో ఎలాంటి సమస్య లున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలలో సంఖ్యను పెంచాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో బాలబాలికలకు ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంగపట్నం లక్ష్మీ రాజేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు ఉదయ భాస్కర్, బిల్‌కలెక్టర్ లక్ష్మణ్, ఆశవర్కర్ స్వరూప, కార్యదర్శులు, రామిరెడ్డి, స్వర్ణలత, పద్మావతి, గంగాధర్, నాగేష్, రమేష్, శ్రీనివాస్, రాజేష్, రాహుల్, సుప్రియ, రవి ప్రకాష్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, ఆయాశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పెషల్ పాలనపై వీడియో కాన్ఫరెన్స్

నాగిరెడ్డిపేట్: గ్రామాల్లో ప్రారంభమైన స్పెషల్ ఆఫీసర్స్ పాలనపై శనివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు సంబంధించి నియమించిన స్పెషల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామాల పాలనపై అవగాహన కల్పించారు. సర్పంచుల ఎన్నికలు జరిగేంతవరకు గ్రామాల్లోపల నిర్వహించాల్సిన పరిపాలనపై వారికి క్లుప్తంగా అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రఘు, శ్రీనివాస్‌తో పాటు ఆయా గ్రామాల అధికారులు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లిలో ప్రత్యేకాధికారి గోపాలకృష్ణకు సన్మానం.. వడ్డెపల్లిలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపడుతున్న ఎంపీవో

వాహనదారులు వాహనచట్టాన్ని అనుసరించాలి

- కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి


సైలెన్సర్‌లను రోడ్‌రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

వాహనదారులు వాహనచట్టాన్ని అనుసరించి తమ వాహనాలను నడుపుకోవాలని కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గత నెలరోజుల నుంచి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా మోటార్‌సైకిళ్లకు పెద్ద శబ్దం వచ్చే సైలెన్సర్లను (మొత్తం 26 సైలెన్సర్‌లు) బిగించి మోటాం సైకిలు నడిపే వ్యక్తులకు మోటార్ వాహనాల చట్టం ప్రకారంగా చలానాలు విధించి, వారి మోటారు సైకిళ్లకు బిగించిన సైలెన్సర్లను విప్పదీసి, వాటిని శనివారం నిబంధనలు మేరకు పంచనామా నిర్వహించి, రోడ్డు రోలర్ సహాయంతో తొక్కించి ధ్వంసం చేయించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటార్ వాహనాలు నడిపే వాహనదారులు వాహనాలకు సంబంధించిన పూర్తి ధ్రువపత్రాలు వాహన చట్టంలో రూపొందించిన సెక్షన్లకు అనుగుణంగా నంబర్ ప్లేట్‌లు కచ్చితంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. ధ్రువపత్రాలు లేకుంటే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని, వాహనాలను సీజ్ చేసి, సంబంధిత కోర్టులో వారిపై అభియోగ పత్రము దాఖలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు పుస్తకాలకు దగ్గరవ్వాలి

- మండల విద్యాధికారి సేవ్ల

నవతెలంగాణ-గాంధారి

విద్యార్థులు పుస్తకాలకు దగ్గరవ్వాలని మండల విద్యాధికారి సేవ్ల అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి సేవ్ల సందర్శించి 10వ తరగతి ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులతో పరీక్షల సంసిద్ధత గురించి తెలుసుకుని పరీక్షల పట్ల ఒత్తిడికి లోనుకాకుండా స్వేచ్ఛగా మంచి ప్రణాళికతో చదవి అందరూ మంచి గ్రేడ్ సాధించి 100శాతం ఫలితాలు సాధించాలన్నారు. తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు అదేవిధంగా మన మండలానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. విద్యార్థులకు పుస్తకాలకు దగ్గరగా ఉండాలని, ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటూ ఉన్న తక్కువ సమయాన్ని పరీక్షలకు చదవడానికి ఉపయోగించాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజపండిత్, ఉపాధ్యాయుల బృందం, సిఆర్‌పి రాజు తదితరులున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి సేవ్ల

టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ప్రణవి అనే విద్యార్థిని సోషల్ స్టడీస్ జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. శనివారం బాన్సువాడలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యార్థిని ప్రణవి తోపాటు గైడ్ టీచర్ లింగమయ్యను అభినందించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చిత్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు, నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం పూర్తి కావడంతో తిప్పారం గ్రామంలోని సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ లక్ష్మణరావు, వార్డు మెంబర్లను గ్రామంలో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు నిర్వహించి గ్రామానికి మంచి పేరు తేవాలని ప్రజలు కోరారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-బోధన్

రానున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని బోధన్ ఆర్డీవో కార్యాలయంలో మాక్ పోలింగ్ కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రజలకు ఈవీఎం మిషన్లపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి అందులో ఈవీఎం మిషన్ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటు వేసినప్పుడు ఏ పార్టీకైతే ఓటర్లు ఈవీఎంపై ఉన్న గుర్తుపై ఓటు వేస్తారో ఓటు వేసినప్పుడు అది ఈవీఎం మిషన్‌లో ఐదు సెకండ్లు ఓటర్లకు కనిపించడం ఎలాగో వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులను ఏర్పాటు చేసి అవగాహన పొందిన ఓటర్ల పేరు, ఫోన్ నెంబరు నమోదు చేస్తున్నారు. ప్రజలలో ఈవీఎం మిషన్ ఉన్న అపోహలను తొలగించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఈ అవగాహన స్టాల్ ఉంటుందని సిబ్బంది పేర్కొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిఐ, ఎస్సైలకు సన్మానం


సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎల్లారెడ్డి సీఐ రవిందర్ నాయక్, ఎస్సై మహేష్‌ను ప్రజాప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఎల్లారెడ్డి సిఐ శ్రీనివాస్, ఎస్సై గణేష్ బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నూతనంగా ఎల్లారెడ్డి సిఐ, ఎస్ఐ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. పోలీసులకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు అందరి సహకారం అవసరమన్నారు. సన్మానం చేసిన వారిలో ఎల్లారెడ్డి మండల నాయకులు, వైస్ ఎంపీపీ నర్సింలు, భిక్కనూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిరంజీవులు, సీనియర్ నాయకులు పరంధములు, హఫీజ్, జైపాల్ రెడ్డి, యునిస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మెమోంటో అందజేత


ఎమ్మెల్యేకు మెమోంటో అందజేస్తున్న నిర్వాహకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్ వేదికగా కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. సొసైటీ చేసే కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. అనంతరం ఆయనకు నిర్వాహకులు మెమోంటోను అందజేశారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేశాం

- గోకుల్ తాండ మాజీ సర్పంచ్ లలితా లింబాద్రి నాయక్

నవతెలంగాణ-రామారెడ్డి

అభివృద్ధి ధ్యేయంగా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా, అందరి సహకారంతో గ్రామ అభివృద్ధి చేసిన ఘనత గ్రామ ప్రజలతోపాటు పంచాయతీ పాలకవర్గం, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు దక్కుతుందని గోకుల్ తాండ మాజీ సర్పంచ్ లలిత లింబాద్రి నాయక్ అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో 5 సంవత్సరాల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు వారికి శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభ, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి నాయక్, గ్రామపంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు నర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని అమృత ట్రూ లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద రోగుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. నేటి రోజులలో వైద్యం అనేది నిరుపేదలకు అందని విధంగా మారిందని, వైద్యం పూర్తిగా కమర్షియల్‌గా మారిన రోజులలో అమృత ట్రూ లైఫ్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ విఘ్నేష్ చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సాల్వినా గర్భిణీలు ప్రసూతి ఇబ్బందులపై అవగాహన కల్పించారు. అనంతరం జనరల్ సర్జన్ డాక్టర్ మౌనిక ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో రోగులకు రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులకు ఘన సన్మానం


సర్పంచులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో శనివారం సాలూర సర్పంచ్ చంద్రకళ, సాలూర క్యాంప్ సర్పంచ్ శ్రీనివాసరావు, ఫతేపూర్ సర్పంచ్ షేక్‌అమీర్‌లను అలాగే వార్డు సభ్యులను గ్రామస్తులు, గ్రామపెద్దలు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాలూర సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ మాట్లాడుతూ.. 5 సంవత్సరాల పాటు గ్రామాల అభివృద్ధికి పాటుపడిన సర్పంచ్‌ల సేవలు మరువలేనివని అన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవలందించడానికి ఉన్నత స్థాయి రాజకీయ పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఇల్తెపు శంకర్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు చందూర్ సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇల్తెపు రమేష్, రావుల లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన సిఐకి ఘన సన్మానం

నవతెలంగాణ-పిట్లం

ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం బాన్సువాడ డివిజన్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో నూతనంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ గౌడ్‌కు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లోని వివిధ మండలాలలో శాంతి భద్రతలకు కృషి చేస్తూ, ప్రజలకు నిర్విరామంగా సేవలు అందిస్తూ ప్రభుత్వ శాఖలలో పోలీస్ డిపార్ట్మెంట్‌ను తల మాణికంలా ఉండే విధంగా కృషి చేయాలని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు మైసయ్య, జిల్లా కార్యదర్శి సురేష్, డివిజన్ సమన్వయకర్త గున్న సాయిలు, సహాయ కార్యదర్శి మల్లూరి సాయిలు, జిల్లా గౌరవ అధ్యక్షులు నర్సింలు, పిట్లం మండల గౌరవ అధ్యక్షులు పి.పాపయ్య, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దోన్‌కంటి పాండురంగం, గౌరవ సలహాదారు గైని పోచయ్య, ప్రకాష్, పేర్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలిపిన జెడ్పిటిసి

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడిగా మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీని నియమించడంతో శనివారం ఆయనను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, కాంగ్రెస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రభుత్వ సలహాదారులుగా నియమించినందుకు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఎంపీటీసీ నిమ్మ శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, పందిరి మధుసూదన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులున్నారు.



ఏకరూప దుస్తులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి పరిసర ప్రాంతంలోని ఆవాస పాఠశాలలో శనివారం సిఆర్‌పి మహమ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వివి టీచర్ వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కామారెడ్డి బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అరవింద్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, జనగణనలో కులగణన చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5, 6తేదీల్లో ఛలోఢిల్లీ కార్యక్రమంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీ బిల్లు కోసం గత 45 సంవత్సరాలుగా ఆర్.కృష్ణయ్య బీసీల పక్షాన అనేక ఉద్యమాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ బిల్లు పెడతామని, జనగణలో బీసీ కులగణన చేపడతామని ప్రకటించే పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి బీసీలందరూ ఏకమై ఢిల్లీకి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చింతల శంకర్ నేత, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ రాజేంధర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రవణ్‌కుమార్‌గౌడ్, వివిధ మండలాల నాయకులు మహేంధర్ సంగగౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ప్రయాణ ప్రాంగణంలో బోర్‌వెల్ మంజూరు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని జుక్కల్ కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలోని నూతనంగా ఎంపిపి బోర్‌వెల్ వేయించారు. శనివారం బస్టాండ్‌లో ఎంపిపి ఆధ్వర్యంలో బోరు పనులు ప్రారంభించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ముఖ్యమైన ప్రధాన అవసరాల సమస్యలను వెనువెంటనే పరిశీలించిన కాంగ్రెస్ వర్కింగ్ మండల ప్రసిడెంట్ వినోద్ బాధ్యతయుతంగా వ్యవహరించి ఎంపిపిని కోరగా వెంటనే ఎంపిపి యశోదా స్పందించారు. నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాదారావ్, వినోద్, బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, రాములు సేట్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


ఎంపీ కలిసిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

ఎంపీ బీబీ పాటిల్‌ను ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు సురేందర్ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వ కంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో గులాబీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలను సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలపై రాజకీయ అంశాల గురించి చర్చించారు. ఆయనను కలిసిన వారిలో శ్రీనివాస్ నాయక్‌తో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులున్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పాత్ర కీలకం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-జుక్కల్

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకంగా ఉంటుందని గ్రామస్తుడు రాజశేఖర్ పటేల్ అన్నారు. శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో యువ నాయకుడు రాజశేఖర్ పటేల్ మాట్లాడుతూ.. సర్పంచ్ అశ్విపటేల్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. సర్పంచ్ అశ్విన్ పటేల్ మాట్లాడుతూ.. తనకు సహకరించిన గ్రామస్తులు, జీపీ కార్యవర్గ సభ్యులకు, జీపీ సెక్రెటరీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపిటిసి విజయ, గ్రామస్తులు హన్మండ్లు శివాజీ, సాయిలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి సిఐకి సన్మానం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి సిఐగా నూతనంగా విధుల్లో చేరిన రవీందర్‌ను కాంగ్రెస్ మండల నాయకులు శనివారం శాలువాతో సత్కరించారు. సిఐని కలిసిన వారిలో కోఆప్షన్ సభ్యులు షాయద్‌పాషా, ఇమామ్, లక్ష్మణ్, గులాం హుస్సేన్, సాయాగౌడ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాధికారికి ఘన సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకురావడంతో డాక్టర్ బండి వార్ విజయ్‌కు మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీతో పాటు అంతాపూర్ గ్రామపంచాయతీ బాధ్యతలు అప్పగించడంతో శనివారం అంతాపూర్ గ్రామపంచాయతీలో బాధ్యతలు తీసుకున్నారు. దీంతో ఆయనను ఘనంగా శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న పలువురు

ఎస్‌హెచ్‌ఓను సన్మానించిన కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఆర్మూర్



నూతనంగా పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను శనివారం పురపాలక కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, శాల ప్రసాద్, లిక్కి శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని సమస్యను పరిష్కరించాలని కోరారు.

తాజా మాజీ సర్పంచ్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని బాల్ గర్ తాజా మాజీ సర్పంచ్ నిహారిక చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు గ్రామ పంచాయతీ కారోబార్ శేఖర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. గ్రామంలో సిసి రోడ్లు, గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పాటు చేయడం, శ్మశాన వాటిక నిర్మించడం పట్ల బాల్ నగర్ గ్రామ ప్రజలకు గతంలో కంటే ఇప్పుడు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున గ్రామ ప్రజలు టపాసులు పేలుస్తూ స్వీట్లు తినిపించుకున్నారని గ్రామపంచాయతీ కారోబార్ శేఖర్ తెలిపారు.

రోడ్డు, భద్రతా చర్యలు పాటించాలి

- ఎస్ఐ భాస్కరాచారి

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషనుకు తరలించి జరిమానాలను విధించారు. అనంతరం ద్విచక్ర వాహనాల గుర్తింపు పత్రాలను (రిజిస్ట్రేషన్ పేపర్ల)ను పరిశీలించి వాహన యజమానులకు ఎస్ఐ భాస్కరా చారి కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లను బిగించిన తదనంతరం వాహనాలను రిలీజ్ చేశారు. నంబర్ ప్లేట్ లేకుండా, తప్పుడు నంబర్ల ప్లేటతో పలు దొంగతనాలకు కొందరు నేరాలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు కచ్చితంగా యజమానులు నంబర్ ప్లేట్స్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్లలో ప్రయాణించడం ప్రాణానికి హానికరమని అన్నారు. కావున వాహనదారులు రోడ్డు,భద్రతా చర్యలు పాటించాలని కోరారు..

ప్రజాతంత్ర, సోషలిస్ట్ విప్లవమే మాస్ లైన్ పార్టీ లక్ష్యం



నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

ప్రస్తుతం దేశంలో ప్రజాతంత్ర, సోషలిస్ట్ విప్లవమే సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ లక్ష్యం అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్ అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్ట్ విప్లవ కారులు తమ పంథా, కార్యక్రమం మార్చుకొనవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) ఇన్సియేటివ్ రివల్యూషనరి పార్టీలు విప్లవోద్యమమే ఏకైక ఎజెండాగా ఐక్యం అవుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే మార్చ్ 03,4,5 తేదీల్లో ఖమ్మంలో 50వేల మందితో భారీ ర్యాలీ, బహిరంగసభను నిర్వహించడం జరుగుతుంది అన్నారు. దేశ ప్రధాని మోడీ నియంతృత్వంతో పాలనా సాగిస్తున్నాడు అని, కేవలం రాముడుపేరుతో, రాముడి జపంతో మాత్రమే పాలనా సాగిస్తూ దేశాన్ని వెనక్కి తీసుకెళ్తు ఆదాని, అంబానీలకు అప్పగిస్తున్నాడు అన్నారు. కార్యక్రమానికి పార్టీ డివిజన్ నాయకులు బాబన్న అధ్యక్షత వహించగ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి, దేవారం, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, పార్టీ డివిజన్ నాయకులు దామోదర్, భీంగల్ కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా నాయకులు రమ, మండల నాయకులు పుష్ప, మాస్ లైన్ మండల నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్ వాసికి అరుదైన గౌరవం

- సత్కారం అందుకున్న కబడ్డీ గంగాధర్




కబడ్డీ గంగాధర్‌ను సన్మానిస్తున్న కాసీని వీరేశం

నవతెలంగాణ-ముప్కాల్

కాసాని కౌసల్య ముదిరాజ్ స్మారకార్థం హైదరాబాద్‌లోని బాచుపల్లిలో జరుగుతున్న 49వ జాతీయ కబడ్డీ క్రీడా పోటీల్లో నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్ మండలకేంద్రానికి చెందిన కోమటిరెడ్డి గంగారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది.. వివరాల్లోకి వెళ్తే ముప్కాల్ వాస్తవ్యులు కోమటిరెడ్డి గంగారెడ్డి (కబడ్డీ గంగాధర్) మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారులు శుక్రవారం రాత్రి ఆ వేదికపై కాసాని విరేశం చేతులమీదుగా చిరు సత్కారం అందుకున్నారు. ఆయన సత్కారం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మోతే గంగారెడ్డి, పీడీ రాజ్ కుమార్, టి.సాయన్న, గద్దల గంగారాం తదితరులు ఉన్నారు.

నూతన సిఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఐని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ కు నిర్మల్ నుండి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన నూతన సీఐ నాగపురి శ్రీనివాస్ ను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. సీఐ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సిఐ ని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 8న బీసీల డిమాండ్ల సాధనకోసం ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారని సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ తెలిపారు. శనివారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో నిజామాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "ఛలో ఢిల్లీ" పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినా కూడ బీసీల కుల గణన లేకపోవడం శోచనీయమని అన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను పెట్టి బీసీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర కార్యదర్శి సత్యప్రకాశ్ అన్నారు. బీసీలకు ప్రమోషన్లల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కరిపె రవిందర్ డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్, సత్యప్రకాష్, కరిపె రవింధర్, మాడవేడి వినోద్ కుమార్, కొయ్యాడ శంకర్, కోడూరి స్వామి, చంద్రమోహన్, సంజీవ్,విజయ్, బసవ కుమార్, మురళి, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ టికెట్ ఎవరికో..?

- బీసీ నేతకేనా?

నవతెలంగాణ-మోపాల్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృశ్యా నిజామాబాద్ జిల్లా పార్లమెంట్ స్థానంపై రాష్ట్రంలో అందరి దృష్టి ఆకర్షింప చేస్తుంది. గత ఎన్నికల్లో మాజీ సీఎం కూతురు ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోటీ చేసి ఓటమిపాలైంది. దాదాపు జిల్లాలో పార్లమెంట్ పరిధిలో అన్ని ఎమ్మెల్యే స్థానాలు టిఆర్ఎస్ ప్రభుత్వం కైవసం చేసుకున్న పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. ముఖ్యంగా కొందరి ఎమ్మెల్యేలే ఆమె ఓటమికి కారణమయ్యారని బహిరంగంగా కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. మళ్లీ ఆమె పార్లమెంటుకు వెళ్తే ఎక్కడ ఆధిపత్యం కోల్పోతామేమోని నియోజకవర్గంలో మా పెత్తనం తగ్గుతుందని ఆమె ఓడితే నియోజకవర్గంలో తామే రాజ్యమేలుతామని ఓటమికి కారణమయ్యారు. ఈ ప్రస్తుత పార్లమెంటు ఎలక్షన్స్‌లో ఆమె పోటీ చేయడానికి ఆసక్తి చూపడం లేదని, ఇప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఘోరంగా ఓటమి చెందినందువల్ల ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన ఒకరికి అవకాశం ఇవ్వాలని టిఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచిస్తుంది. అందులో ప్రధానంగా రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడం మరియు అందు లోనూ మోస్ట్ సీనియర్ అండ్ డైనమిక్ లీడర్‌గా పేరు ఉంది. దాదాపు మూడు నియోజకవర్గాల్లో విజయకేతనం ఎగరవేసినందున ఆయనపై టీఆర్ఎస్ గంపెడు ఆశలు పెట్టుకుంది. మరి టికెట్ ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.

కాంగ్రెస్ పార్టీలో రోజు రోజుకి ఆశావాహుల సంఖ్య పెరుగుతుంది కానీ ఎందరున్నా కూడా ప్రముఖంగా సినీ నిర్మాత నిజామాబాద్ జిల్లా వాసైనా నర్సింపల్లి గ్రామానికి చెందిన దిల్ రాజు పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆయన చాలా సంవత్సరాల నుండి మా పల్లె చారిటబుల్ ట్రస్ట్ నుండి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



అలాగే ఇందూరు తిరుమల పుణ్యక్షేత్రం ద్వారా చాలామంది చిన్నపిల్లలకు ప్రకృతి పరమైన ఔషధాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. అలాగే గర్భిణి స్త్రీల కూడా ఉచితంగా ఔషధాన్ని ఇవ్వడంతో స్థానికులే కాకుండా జిల్లా నలుమూల నుండి కూడా అక్కడికి వచ్చి ఔషధాన్ని ఉచితంగా స్వీకరించడం జరుగుతుంది. చాలామంది కాంగ్రెస్ నాయకులకు కూడా దిల్ రాజుకు టికెట్ వస్తే కచ్చితంగా గెలిపించి తీరుతామని అటువంటి కల్మషం లేని వ్యక్తి తమ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం కంటే ఇంకేం కావాలని కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దిల్ రాజు వ్యక్తిగతంగాను, సౌమ్యుడిగా అందరితో కలుపుకపోయే వ్యక్తి అని ఆయనను దగ్గరగా చూసిన వాళ్ళు ఎప్పుడు చెబుతు ఉంటారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా దిల్ రాజుకు దగ్గరికి వెళ్తే తమ సమస్య తీరుతుందని అక్కడ స్థానిక ప్రజలందరికీ తెలుసు. అటువంటి వ్యక్తి ఈరోజు పార్లమెంట్ వ్యక్తి అయితే ఇంకా మా మండల గ్రామ సమస్యలతో పాటు జిల్లా సమస్యలు కూడా తీరుతాయని, ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో ఉన్న నాయకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.



ముఖ్యంగా దిల్ రాజుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా మాజీమంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. రేవంత్‌రెడ్డి గతంలో పిసిసి అధ్యక్షుల హెూదాలో జిల్లాలో పర్యటించినప్పుడు ఇందూరు తిరుమల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని వెళ్లారు. ఇక్కడ వాతావరణాన్ని చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

కచ్చితంగా దిల్ రాజుకి ఈసారి పార్లమెంట్ టికెట్ వస్తే ఇందూరు గడ్డపై మరోసారి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి విజయకేతనం ఎగురవేస్తారని కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. దిల్ రాజుకి టికెట్ కేటాయిస్తే గ్రూప్ రాజకీయాలు లేకుండా అందరు కలిసికట్టుగా పనిచేసే ఆయన విజయానికి అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తలు తన సొంత ఇంట్లో వ్యక్తి పోటీ చేసే ఇంత కష్టపడతామో ఆ విధంగా కష్టపడతామనీ బహిరంగంగానే చెబుతున్నారు. పది సంవత్సరాల నుండి తమ పార్టీ రాష్ట్రంలోని కేంద్రంలో అధికారంలో లేదని మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఈసారి పార్లమెంట్లో కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని దిల్ రాజును గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కానుకగా ఇస్తామని కార్యకర్తలు తెలుపుతున్నారు.

భారతీయ జనతా పార్టీలో దాదాపు సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అరవింద్ మరొకసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. దాదాపు ఆయనే భాజాపా అభ్యర్థిగా అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అరవింద్‌కి స్వంత పార్టీలోనే వ్యతిరేకవర్గం చాలా మంది సీనియర్లు అందరినీ పక్కనపెట్టి జిల్లాలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడుని, ఇటీవల అసెంబ్లీ టికెట్ విషయంలో కూడా తన మార్కు చూయించాడని జిల్లాలో పార్టీని తన కంట్రోల్లో పెట్టుకుని తనకు నచ్చిన వారికి టికెట్లు కానీ పార్టీ అధ్యక్షులు పదవి కాని ఇస్తున్నాడని, సంవత్సరాల నుండి పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తులను పక్కన పెట్టాడని. తనకు నచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నాడని చాలామంది కార్యకర్తలు కృంగిపోతున్నారు. సమయం చూసి దెబ్బ కొట్టాలని కొందరు నాయకులు ఎదురుచూస్తున్నారని బహిరంగ రహస్యం. ఇక నిజామాబాద్ పార్లమెంట్ బాద్‌షా ఎవరు అనేది అతి కొన్ని రోజుల్లో తెరపడనుంది. ముఖ్యంగా పార్లమెంటుకు పోటీ చేసే వ్యక్తి దాదాపు 50 కోట్లకు పైబడి ఖర్చు పెట్టాలని కొందరు లోలోపల భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎందుకంటే మొన్న జరిగిన అసెంబ్లీ ఎలక్షన్లో దాదాపు ఒక్కొక్క ఎమ్మెల్యే అభ్యర్థి 15 నుంచి 20 కోట్ల వరకు ఖర్చు పెట్టారని, ఇప్పుడు తన పార్లమెంట్ పరిధిలో దానికి నాలుగు రెట్లైనా ఎక్కువగా పెట్టాల్సిందే అనే కొందరు పోటీ చేసే వ్యక్తులు భయపడుతున్నారు. ఇప్పటికైనా కొత్తగా పార్లమెంట్‌లో గెలిచిన వ్యక్తి జిల్లా సమస్యలపై పోరాడి అత్యధికంగా నిధులు సాధించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రైల్వే లైన్ విషయంలో జిల్లాకు ఎప్పుడు అన్యాయమే జరుగుతుందని, ఇప్పుడు కొత్తగా వచ్చే పార్లమెంట్ పార్లమెంట్ వ్యక్తి అయిన జిల్లాపై కనికరం చూపాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

క్యాన్సర్‌ను జయించండి

- సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్
- జీజీహెచ్‌లో జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్‌ఆసుపత్రి నిజామాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథి జిల్లా జడ్జి కే.సునీత, జిల్లా న్యాయ సేవ అధికారి (డి.యస్.ఎల్.ఎ) పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాన్సర్ పై అవగాహన పెంచుకోవాలని , కాలానుగుణంగా క్రమం తప్పకుండా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అడగననే జిల్లా కోర్టు మహిళా ఉద్యోగులకు, జిల్లా ఫారెస్ట్ మహిళా ఉద్యోగులకు ఇక్కడ స్కానింగ్ పరీక్షల ఏర్పాటు చేసినందుకు డా. ప్రతిమారాజ్‌కు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అతి వేగంగా వ్యాపిస్తున్న మహమ్మారి ఈ క్యాన్సర్ వ్యాధి అని అన్నారు. ప్రతి ఆరు మరణాల్లో ఒకటి క్యాన్సర్ మరణం ఉంటుందని, ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సగానికి పైగా క్యాన్సర్ మరణాలు ఉంటాయని మేధావుల అంచనా అని తెలిపారు. మామో గ్రాఫ్, పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొంది జయించాలని సూచించారు. స్త్రీలలో గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్లను గుర్తించడానికి పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. అలాగే పురుషులలో పొగాకు వల్ల ఎక్కువ సంభవిస్తుందని, అందుకే ధూమపాన నిషేధంతో క్యాన్సర్‌ను నివారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా. సరస్వతి, డా. పూర్ణిమ, డా. అనుపమ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రతిమరాజ్

ఇళ్ల స్థలాలు చూపించాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఇళ్ల పట్టాల కొరకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారని బాధితులు తహసిల్దార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఇప్పటివరకు ఇంటి స్థలం పొజిషన్ చూపించలేదని అన్నారు. తమకు స్థలాలు చూయించి మమ్మల్ని ఆదుకోవాలని ఆదుకోవాలి బాధితులు కోరారు.

మహిళలను గౌరవించడం ఆనందంగా ఉంది

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వైద్యురాలిని సన్మానిస్తున్న బీసీ సంఘం మహిళలు

మహిళలను గౌరవించడం ఆనందంగా ఉందని డాక్టర్ అరుణ అన్నారు. శనివారం జాతీయ మహిళా ఫిజీషన్ వైద్యుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అరుణకి జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సెక్రటరీ నవతే లావణ్య ప్రముఖ వైద్యురాలు ని శాలువా కప్పి, మెమొంటో ను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సాటి మహిళలను గుర్తించి మహిళా వైద్య దినోత్సవం సందర్భంగా సన్మానించడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్

నవతెలంగాణ - మెండోర

మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడవో పథకంలో భాగంగా జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యం మార్గదర్శక శిక్షణ కార్యక్రమం ఆర్మూర్ ప్రాజెక్టు పరిధిలో బుస్సాపూర్ కేజీబీవీ పాఠశాలలోగల విద్యార్థినులకు శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఆర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, సైకాలజిస్ట్ కె.సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినిలకు జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్య పరిస్థితుల గురించి వివిధ ఆక్టివిటీస్ ద్వార వారి స్ట్రెస్ ఎలా కంట్రోల్ చేసుకోవాలి.. పరీక్ష సమయంలో నేర్చుకున్న దానిని ఎలా ప్రజెంట్ చేయాలి అనే విషయాల గురించి తెలిపారు. కార్యక్రమంలో డిహెచ్ ఈ డబ్లు జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ స్వప్న , స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్స్ లిటరసీ పుష్ప , అంగన్వాడీ టీచర్స్ , కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయిని లు , 132 మంది విద్యార్థినిలు హాజరయ్యారు.

కృష్ణవేణి పాఠశాలలో కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం నేత్ర వైద్యులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విజయ్ కర్తన్, ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్హాజ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎంపి టి్కెట్ కోసం దరఖాస్తు చేసిన వికాస్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్



దరఖాస్తు అందజేస్తున్న వికాస్‌రెడ్డి

యువజన కాంగ్రెస్ నాయకులు కాటిపల్లి వికాస్ రెడ్డి శని వారం గాంధీ భవన్‌లో నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి చెయ్యడమే లక్ష్యంగా నిజామాబాద్ ఎంపీ సీటు గెలుస్తామని, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ రునం తీర్చుకుందామని ఆయన తెలిపారు.

టీడీపీలో మైనార్టీ నాయకుల చేరిక



చేరిన నాయకులకు కండువా వేస్తున్న వినోద్‌కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలుగుదేశం పార్టీలో మైనార్టీ నాయుకులు చేరారని టిడిపి అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ శనివారం తెలిపారు. పార్టీ విధి విధానాలు నచ్చి భారీగా మైనార్టీ నాయకులు నిజామాబాద్ పార్లమెంట్ పరిధి లో టిడిపి లో చేరారని అన్నారు. ఈ కార్యక్రమం అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో బిజినెస్ సెల్ అధ్యక్షులు బొబ్బ నరసింహ రావు, తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, ఫిరోజ్, పాసుల రాజు, అశోక్ అర్సపల్లి, హరీష్‌సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించిన వాహనదారులకు సన్మానం



వాహనదారులకు పూలు అందజేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఏర్గట్ల

రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలు పాటించి,హెల్మెట్ ధరించిన వాహనదారులను భీంగల్ సిఐ శ్రీనివాస్, ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. వారి చేతికి పూలు, చాక్లెట్లను అందించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ... వాహనదారులు అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్ళ పాల్గొన్నారు.

నిరంతర సేవా కార్యక్రమాలతోనే గెలుపు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అర్బన్‌లో ఎమ్మెల్యే గా గెలువడానికి ప్రధాన కారణం నిరంతరంగా ప్రజలకు తమ తల్లి, తండ్రుల పేర్లతో చేస్తున్న సేవ కార్యక్రమాలే అని ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. మహారాష్ట్ర పండరిపూర్ ఎస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన 3వ ఆర్యవైశ్య మహాసభ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అటవీ, సాంస్కృతిక శాఖామాత్యులు సుధీర్ బౌ ముంగంటివార్, ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతు వైశ్యుల్లో ఉన్న మేధావులు, యువత రాజకీయల్లోకి రావాలన్నారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదవాళ్ళని అర్థం చేసుకొని బిజెపి కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కల్పించారని అన్నారు. ఆర్యవైశ్య అభివృద్ధి కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల నుండి సహాయ, సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సమీర్ భావు కునావర్ ఎమ్మెల్యే హింగన్‌ఘాట్ నియోజకవర్గం, గుబ్బా చంద్ర శేఖర్‌జీ చైర్మన్- ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ బోర్డు, సంపద, బచ్చు విలాస్ గుప్తాజీ తాత్కాలిక కమిటీ సభ్యుడు శ్రీ కాశీ అన్నసత్రం, నంద కుమార్ దత్తాత్రయ గదేవార్, మహారాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు, నిజామాబాద్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

పంచాయతీ ప్రత్యేకాధికారికి సన్మానం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్ మైలారం గంగాధర్‌ను తాజా మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ సన్మానించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి గంగాధర్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించినందుకు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ప్రత్యేక అధికారికి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నారాయణ, రమేష్, ఆశన్న, సుదర్శన్, శ్రీనివాస్, సంజీవ్, శ్రీనివాస్, దేవేందర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా ఈర్ల రాజు



నవతెలంగాణ-రెంజల్

బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా ఈర్ల రాజును నియమించినట్టు బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ పేర్కొన్నారు. శనివారం అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఈర్ల రాజు కు నియామ కపత్రాన్ని అందజే శారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ, మాజీ అధ్యక్షులు చుక్క రాజుగౌడ్, స్థానిక నాయకులు రంజిత్, మేస్త్రీ రాజు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గానికి సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ లో స్పెషల్ ఆఫీసర్ సూపరింటెండెంట్ రమణ, సెక్రెటరీ రేణుక దేవి ఆధ్వర్యంలో మాజీసర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, పాలకవర్గానికి సన్మానించారు. పదవి కాలం ఐదు సంవత్సరాలు పూర్తి చేసినందుకు శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. మాజీ సర్పంచ్ వనజ గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాలు సహకరించిన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గడువులోగా యూజర్‌ఛార్జి, నీటి పన్ను చెల్లించాలి

- మేయర్ నీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ ఛాంబర్ లో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ తో కలిసి ట్రేడ్ లైసెన్స్ నీటి పన్నుపై సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి రావలసిన బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని, సుదీర్ఘకా లంగా పెండింగ్‌లో ట్రేడ్ లైసెన్స్, యూసర్ చార్జెస్, నీటి పన్ను వసూలుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. ప్రజా అవసరాలను తీర్చటానికి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కలిపించటానికి



మాట్లాడుతున్న మేయర్ నీతూ కిరణ్

చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రజలు నిర్ధిత గడువులోగా ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జెస్, నీటి పనులను చెల్లించి మున్సిపల్ అధికారులకు సహకరిం చాలని కోరారు. సమావేశంలో అస్సిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, అకౌంట్ ఆఫీసర్ సుధాకర్, మున్సిపల్ ఇంజనీర్ మురళి మనోహర్, సెక్రెటర్రీ శ్రీపాద రామేశ్వరం, మేనేజర్ జనార్ధన్ ఎం.హెచ్.ఓ సాజిద్ అలీ, టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

డాల్ఫిన్ బేకరీ తినుబండారాలు సీజ్

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-ఆర్మూర్

తనిఖీలు ఏవి.. లోపించిన పర్యవేక్షణ అంటూ శనివారం నవ తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని బాలాజీ పెట్రోల్ పంప్ ఎదురుగానున్న డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో కేక్ లు, తినుబండారాలను ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేసి సీజ్ చేశారు. పట్టణంలోని డాల్ఫిన్ బేకరీలో కుళ్ళిన కేకులు విక్రయిస్తున్నారని ఫిర్యాదు మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బేకరీ లోని కేకుల తయారు చేసే గదిలో పరిశీలించారు. దుకాణంలో విక్రయిస్తున్న కేక్‌లు, ఆహార పదార్థాలను సేకరించి సీజ్



బేకరీని పరిశీలిస్తున్న అధికారులు

చేసి పంచనామా నిర్వహించారు. సీజ్ చేసిన శాంపుల్ పదార్థాలను హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తా మన్నారు. 15 రోజుల తర్వాత రిజల్ట్ వచ్చిన తర్వాత చట్టపరంగా సీజ్ చేస్తామని చెప్పారు. ఆయనవెంట మున్సిపల్ ఏఈ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట మార్చిన ఫుడ్ ఇన్స్పెక్టర్..

బేకరీని తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తారా నాయక్ మొదట విలేకరులతో మాట్లాడుతూ.. సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ సమక్షంలో చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ శాంపుల్ నివేదిక వచ్చిన తర్వాత బేకరీ దుకాణాన్ని సీజ్ చేస్తానని చెప్పడం గమనార్హం.

పౌరహక్కుల రక్షణ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ డివిజన్ పోలీసు అధికారులకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేష్ గౌడ్ మహమ్మద్ రహిమొద్దీన్ శనివారం శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. పౌరహక్కుల రక్షణ చట్టం 1954 గురించి ప్రథమ సమాచార సేకరణ నుండి కోర్టులో చార్జ్‌షీట్ వేసే వరకు జరుగుతున్న లోపాల గురించి తెలిపారు. కేసులో నేరస్థులకు శిక్ష పడేటట్టు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నరస్రయ్య, ఎసిపి కిరణ్ కుమార్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్, డివిజన్ సిఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ ఆఫీసర్లు, లైసెనింగ్ ఆఫీసర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

16న సమ్మెను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 16న దేశభక్తి సమ్మెలో పాల్గొనాలని కార్మిక సంఘాల నాయకులు కార్మిక లోకానికి పిలుపును ఇచ్చారు. పట్టణంలో ఐఎఫ్టియు ఆఫీసులో పాత్రికేయుల సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఎండి కాజా మొయినుద్దీన్, ఎల్ఐసి యూనియన్ నాయకులు వి బాలయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, బిటిసి ఆర్మూర్ నాయకులు రాజేశ్వర్ లు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలకు భిన్నంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని, కార్మికుల ఉపాధిని కొల్లగొట్టారని అన్నారు.

రోడ్ సేఫ్టీ బిల్లు పేరుతో ఆటో కార్మికుల పొట్ట కొట్టకూడదని ప్రధానమంత్రిని వారు కోరారు.సపాయి కార్మికుల వేతనాలు పెంచి , 2016 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, విద్యార్థి యువజన, మహిళలు, ఉద్యోగులు, మేధావులు, ఐక్యంగా



మాట్లాడుతున్న నాయకులు

మోడీ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మె గ్రామీణ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపి తగిన గుణపాఠం నేర్పించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

6న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ నిజామాబాద్ జిల్లా కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ డిఇ ఓకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వంట బందు చేసి గ్రామీణ బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎం డి ఎం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండల ప్రెస్ క్లబ్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షులుగా ఆంధ్ర ప్రభ సీనియర్ జర్నలిస్ట్ అంకం మురళి ధర్, ఉపాధ్యక్షులుగా భీమప్ప నమస్తే తెలంగాణ, సెక్రెటరీగా సుదర్శన్-ఆంధ్ర జ్యోతి, ట్రెజరర్‌గా రవి కాంత్-ఈనాడు, జాయింట్ సెక్రెటరీగా రజినీష్-సాక్షి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఆర్ కరుణాకర్-నవ తెలంగాణ ఎన్నియ్యారు.

పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలోని నందిపేట్ మండల యూత్ నాయకులు లక్కంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సుమలత భర్త మహేందర్ గుండెపోటుతో మృతిచెందగా శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. బి ఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ,నియోజకవర్గ ఇంచార్జ్ రాజేశ్వర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు. చిన్న వయసులో మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆశ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఆశ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి వైద్య బృందంతో వేల్పూర్ మండల కేంద్రంలోని హై స్కూల్‌లో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యులు శేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి శనివారం తెలిపారు. ల్యాబ్ టెస్ట్, క్రిటికల్ కేర్ ఎమర్జెన్సీలతో పాటు గుండె, నరాల, గ్యాస్ట్రో, ఎముకల వైద్య నిపుణులు పాల్గొంటారని చెప్పారు. ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

సమావేశానికి కార్యకర్తలందరూ రావాలి

- జెడ్పిటిసి కమల నరేష్ పిలుపు

నవతెలంగాణ-మోపాల్

సోమవారం రూరల్ నియోజకవర్గంలో రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని, కావున టిఆర్ఎస్ సైనికులు, కార్యకర్తలు, ప్రజలు రావాలని జెడ్పిటిసి కమల నరేష్ తెలిపారు. ఈ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథు లుగా టీఆ ర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ హాజరవుతారని తెలిపారు. మండల నాయకులందరూ తప్పక హాజరవ్వాలని అన్నారు.వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ గడ్డపైన బీఆర్ఎస్ జెండా ఎగర వేయాలని ఆయన కోరారు.

16న దేశ వ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16 న దేశవ్యాప్త కార్మికుల సమ్మె - గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని తెలంగాణ గ్రామపంచా యతీ వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ జిల్లా ఐఎఫ్టియు అధ్యక్ష, కార్యదర్శి ఎండి. ఖాజా మొయినుద్దీన్, జెపీ. గంగాధర్ ఆధ్వర్యంలో డిచ్ పల్లి మండల కేంద్రంలో సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు సుప్రీంకోర్టు నిర్ణయించిన విధంగా వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ పథకాలను అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు నిజామాబాద్ జిల్లా కమిటీ కోశాధికారి సుధాకర్, సహాయ కార్యదర్శి నర్మల శాంసన్, సభ్యులు ఎన్.లక్ష్మణ్, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, కవిత సమావేశం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 5న డిచ్‌పల్లి మండల కేంద్రంలోని జి కన్వెన్షన్లో జరిగే రూరల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు, శాసనసమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత రానున్నారని

ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్,మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చిలువేరి గంగదాస్ అన్నారు. శనివారం ఇందల్ వాయి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ ను ఇందల్ వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా నుండి భారీ ర్యాలీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ విస్తృత



మాట్లాడుతున్న నాయకులు

సమావేశానికి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, సోసైటి చైర్మన్ చింతల పల్లి గోవర్ధన్ రెడ్డి, నిజామాబాద్ రూలర్ ఎస్సీ సెల్ కన్వీనర్ పాశం కుమార్, సినియర్ నాయకులు గడ్కోలు శ్రీనివాస్,కుంట నర్సారెడ్డి మోహన్ నాయక్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, బిరీష్ శేట్టి,పిండి గంగాధర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి/మోపాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ రాష్ట్ర సలహాదారులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ షబ్బీర్ అలీ ని శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. డిచ్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, సీనియర్ నాయకులు గడీల రాములు, తదితర నాయకులు కలిసి పులబోకే, శాలువాతో ఘనంగా సన్మానించారు.



షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమ్మడి జిల్లాల టీఎన్జీవో కోఆర్డినేటర్, ఎంప్లాయిస్ జేఏసీ నిజామాబాద్ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ ని రాష్ట్ర సచివాలయ అధికారిక కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సలహాదారులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా వారిని టీఎన్జీవోస్ పక్షాన శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ , సహధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి , కామారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్ రెడ్డి సాయిలు కేంద్రభాద్యులు నాగరాజు, మచ్చుకూరి సతీష్, సలహాదారులు ఆకుల ప్రసాద్ ఉమ్మడి జిల్లాల టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాధికారులు సమర్ధవంతంగా సేవలు అందించాలి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి
- ఈ నెల 07 నుంచి 15 వరకు జీపీలలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డి.అనసూయ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రజలకు సమర్ధవంతంగా సేవలందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సూచించారు. పంచాయతీరాజ్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావుతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లతో



మాట్లాడుతున్న కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినందున వారు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని హితవుపలికారు. స్పెషల్ ఆఫీసర్లకు వారి అధికారాలు, బాధ్యతల గురించి పరిపూర్ణంగా తెలియజేసేందుకు వీలుగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా వేసవి సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా, ఇంటింటికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించా లని కార్యోన్ముఖులు చేశారు. ముఖ్యంగా ఈ నెల 07 నుండి 15 వ తేదీ వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టి ఆదర్శంగా నిలిచిన ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి పండుగ వాతావరణంలో సన్మానించాలని కలెక్టర్లకు సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు బావన్న, శంకర్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ విభాగం అధికారి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి ప్రసాదం పంపిణీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో అయోధ్య బాల రాముని ప్రసాదం శనివారం ఇంటింటికీ పంపిణీ చేసినట్లు రామభక్తులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి మనోహర్‌రెడ్డి, వంశీగౌడ్, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

